
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

సోమవారం 10 ఫిబ్రవరి 2025

సత్యానంద ఆశ్రమంలో పూజలు

కథలాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట భగవాన్ శ్రీ సత్యానంద ఆశ్రమంలో ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భూషణరావుపేటలో ఆదివారం జరిగిన మల్లన్నస్వామి జాతరోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. పలువురు స్వామిజీలు ఎమ్మెల్యేకు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, పులి హరిప్రసాద్, స్వామిరెడ్డి, చిన్నారెడ్డి, సత్యనారాయణ, మల్లేశ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను పోషించని వారికి కౌన్సెలింగ్

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పోషించని కొడుకులు, కూతుళ్లు, వారి కోడళ్లకు తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, ప్రతినిధులు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. తమ తల్లిదండ్రులను పోషిస్తామని ఒప్పంద పత్రం రాయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం, వెలుముల ప్రకాష్ రావు, కరుణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

కొడిమ్యాల, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన వెంగాల సంపత్(40) అనే వ్యక్తి ఆదివారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. సంపత్ ఇద్దరు వ్యక్తులతో కలిసి కాలకృత్యాల కోసం ఒక వ్యవసాయ బావిలోకి నీటి కోసం దిగగా బావిలో పడిపోయాడని మృతుడి భార్య కనకలక్ష్మి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కల్యాణానికి ఆహ్వానం

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలంలోని అంబారిపేట గ్రామంలో జరుగనున్న వేంకటేశ్వర స్వామి 25వ కల్యాణ వార్షికోత్సవానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను అందజేశారు.

నియామకం

కొడి మ్యాల, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షునిగా చిలువేరి నర్సింహా రెడ్డిని సభ్యులు ఆదివారం ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా ఇనుకొండ ప్రభాకర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకుంటామని సభ్యులు తెలిపారు.

ఓట్ల వేటలో ఎమ్మెల్సీ అభ్యర్థులు



- ముమ్మరంగా ప్రచారం
- జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 34,693 మంది
- ఆత్మీయ సమ్మేళనాలతో ఓటర్లకు దగ్గరయ్యే యత్నం

జగిత్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎలాగైనా ఓటర్ల మద్దతు కూడగట్టి విజయం సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. నామినేషన్లకు సోమవారం వరకు అవకాశం ఉండగా పరిశీలన, ఉపసంహరణ ప్రక్రి య 13వ తేదీతో ముగుస్తుంది. ఈనెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను నిర్వహించనున్నారు. మార్చి 3న ఓట్లలెక్కింపు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే నామినేషన్లను వేసిన అభ్యర్థులు ప్రచార జోరు పెంచుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు ప్రచారంపై దృష్టి సారించారు.

● ఉపాధ్యాయ ఓటర్లు 1,730 మంది

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి జిల్లాలో 34,693 మంది ఓటర్లు ఉండగా అందులో 21,302 మంది పురుషులు, 13,391 మంది స్త్రీలు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 51 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 300 నుంచి 400 మంది వరకు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునే విదంగా ఏర్పాట్లు చేయనున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జిల్లా వ్యాప్తంగా 1,730 మంది ఓటర్లుండగా ఇందులో 1,208 మంది పురుషులు, 522 మంది స్త్రీలు ఉన్నారు. జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీకు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. కాగా జగిత్యాలకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ కాలపరిమితి, కూర రఘోత్తం రెడ్డి ప్రాతినిత్యం వహిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాల పరిమితి 2025 మార్చి 29తో ముగియనుంది.

● ఐదు మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధి ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ఓటర్లను దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పట్టభద్రుల స్థానానికి బరిలోకి దిగిన అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి ప్రచారం చేస్తున్నారు. బీజేపీ నుంచి పట్టభద్రుల

మిగతా 8లో

గురుకులాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ గౌతం రెడ్డి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ గదులు, మరుగుదొడ్లు, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించిన ఆయన వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు కొత్త డైట్ ప్రకారం భోజనం పెడుతున్నారా అని గురుకులం ఇన్‌చార్జిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ రికార్డులను తనిఖీ చేశారు. సంబంధిత హాస్టల్ అధికారికి హాస్టల్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. సంబంధిత హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెటనే పరిష్కరించాలని జిల్లా అధికారిని ఆదేశించారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్తంభంపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్గటూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లిలో శ్రీ అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన పీఠంపై స్వామి వారి ఉత్సవ మూర్తులను నిలిపి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పుంజలి పవన్ కుమార్ స్వామి మంత్రోచ్చరణల మధ్య కల్యాణం నిర్వహించారు. మహిళలు స్వామి వారికి ఒడి బియ్యం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చింతలరాజయ్య, నాయకులు రాంచంద్రం గౌడ్, పాదం దుబ్బ స్వామి, మెరుగు మురళి, సంగనబట్ల దినేష్, పూదరి రమేష్, గంగయ్య, కిరీటి, నరేష్ గౌడ్, సందీప్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో ఆదివారం ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



మాసాయిపేటలో బోనాల ఊరేగింపులో శివసత్తులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లుల్ల గ్రామ అనుసందనమైన మాసాయిపేటలో మల్లన్న జాతరను యాదవులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్లన్న స్వామి ఆలయాన్ని పచ్చటి తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లోని భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఒడి బియ్యం, కానుకలు సమర్పించుకున్నారు. సాయంత్రం మహిళలు, భక్తులు ఉపవాస దీక్షలతో భక్తి శ్రద్ధలతో బోనం కుండలను అలంకరించి నైవేద్యాన్ని తయారు చేశారు.

భక్తులు బోనాలను నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పులతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతు రాజుల విన్యాసాలు కళాకారుల నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులు బోనాలతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం, ఆలయాభివృద్ధి నాయకులు, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

యాదవుల హక్కుల సాధనకు పోరాటం



మాట్లాడుతున్న యాదవసంఘం నేత మల్లేశ్

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : యాదవుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం, చైతన్య కోసం పోరాటం చేస్తామని జిల్లా యాదవ సంఘం అడహక్ కమిటీ అధ్యక్షుడు గనవేని మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కిషన్‌రావుపల్లెలో యాదవుల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యాదవ సంఘాలను బలోపేతం చేసి ఐక్యతగా ఉండేలా చూస్తామని తెలిపారు. 16 మంది సభ్యత్వాల రసీదులను అందజేశారు. ఈ సందర్భంగా అరికంటి సాగర్, ముక్కెర రాజగంగారాం, మల్లయ్య, రాజ్‌కుమార్, గంగరాజం, ప్రకాశ్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఎండపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో శనివారం రాత్రి దొంగలు పడి బంగారం ఎత్తుకెళ్ళిన ఘటన మండలంలోని కొత్తపేట గ్రామంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన జాడి మల్లేశం ఇంట్లో రాత్రి దొంగలు పడ్డారు. మల్లేశం తమ అత్తగారింటికి ఓ శుభ కార్యానికి కుటుంబ సభ్యులతో వెళ్ళాడు.

దొంగలు రెండు తులాల బంగారం, పట్టు చీరలు, కొంత నగతును, ఇంట్లో ఎలక్ట్రికల్ వస్తువులను దొంగిలించారు. ఉదయం ఇంటికి వెళ్ళి చూసే సరికి తలుపులు పగులకొట్టి ఉండడం వలన 100కి ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి దర్యాప్తు చేపట్టారు. బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అంబేద్కర్ అందరికీ ఆదర్శ ప్రాయుడు



అంబేద్కర్ విగ్రహానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) అంబేద్కర్ భావి తరాలకు ఆదర్శ ప్రాయుడని ఎమ్మెల్యే డాక్టరు సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని బట్లపెల్లి గ్రామంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత అంబేద్కర్ చూపిన మార్గంలో నడవాలని సూచిం చారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే భారతదేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు లభిస్తున్నాయని తెలిపారు. భారతదేశంలో కుల గణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని పేర్కొన్నారు. అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను అంబేద్కర్ సంఘం నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పూదారి శోభన్, అర్రే ప్రేమ నందం, మండల నాయకులు గుర్రాల రాజేందర్‌రెడ్డి, సొల్లు సురేందర్, మనోహర్ రెడ్డి, డిల్లీ రామరావు, సుధాకర్‌రావు, నారాయణరావు, నర్సింహరెడ్డి, కోల శ్రీనివాస్, తిరిపెల్లి రాజయ్య, మధుకర్, రిటైర్డ్ ఎంఈవో నారాయణ, అడ్వకేట్ లక్ష్మీనారా యణ, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామంలో ఇటివల మృతి చెందిన పలువురి కుటుంబాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరామర్శించారు. ఆదివారం గ్రామంలోని పార్టీ కార్యకర్తల కటుంబాలతో పాటు పలువురి బాధిత కుటుంబాల ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సంతపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు పాక నర్సయ్యయాదవ్, నరేష్‌లు తదితరులు ఉన్నారు.

'ఆప్ అవినీతి పాలనకు చరమగీతం'

కోరుట్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాల కాంగ్రెస్, ఆప్ అవినీతి పాలనకు డిల్లీ ప్రజలు స్వస్తి చెప్పి నరేంద్రమోదీ సమర్థ పాలన కావాలని తీర్పునిచ్చారని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం కోరుట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను తామే ఇస్తున్నట్టు ప్రజలను నమ్మించి మోసం చేశాయని పేర్కొన్నారు. లిక్కర్ స్కాంలో వేలాది కోట్లు సంపాదించిన ఆప్ నేతలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని అన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ బీజేపీ నేతల సమిష్టి కృషితో విజయం సాధించిందని తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

- భారీగా తరలి వచ్చిన భక్తులు 7



బీర్‌పూర్‌లో లక్ష్మీనరసింహుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

బీర్‌పూర్‌లో అలజడి

- వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో..
- మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామంలో ఆందోళన
- ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని గుబులు

6

కొండగట్టు క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్సీ కవిత
- అంజన్న సన్నిధిలో పూజలు 7



కొండగట్టులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న జగిత్యాల న్యూ హైస్కూల్ విద్యార్థులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని న్యూ హైస్కూల్‌లో 1989-1990 సంవత్సరంలో చదివిన పదవ తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారికి చదువు చెప్పిన గురువులు గడ్డం కైలాసం, కిషన్, గంగాధర్ లతో విద్యార్థులు ఫోటోలు తీసుకున్నారు. కార్యక్రమంలో తిరుపురం రాంచందర్, ఎర్రోజు రజన్ కుమార్, తోట జితెందర్, లింగ శ్రీనివాస్, మన్నాన్, మల్యాల అశోక్, లతావుల్లా, నక్క గంగాధర్ పాల్గొన్నారు.

● ఎండపల్లి: మండలంలోని పాతగూడూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2001-2002 పదవ తరగతి విద్యార్థులు సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శనిగారపు మల్లేష్, సురేందర్, లక్ష్మణ్, ఓనగంటి బుచ్చయ్య, కొమురవెల్లి, సంజీవ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలో బంగారు పతకం

గంగాధర, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థిని అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ వారుణి తెలిపారు. ఈ నెలలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఇంటర్ నేషనల్ ఓపెన్ కరాటే పోటీలను నిర్వహించారు. పాఠశాల నుంచి లగిషెట్టి శరణ్య పాల్గొని అండర్ 14 విభాగం స్పారింగ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకం, 40 కిలోల విభాగంలో కటాస్‌లో ద్వితీయ స్థానం పొందినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి అంతర్జాతీయ కరాటే క్రీడల్లో పాఠశాల కీర్తిని చాటి బహుమతులు పొందిన శరణ్యను సన్మానించారు. కార్యక్రమంలో కరాటె మాస్టర్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బంగారు పతకం సాధించిన విద్యార్థిని శరణ్య

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన చర్యలు చేపట్టారు.


స్వామి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ప్రైవేటు డిగ్రీ కళాశాలలో షార్ట్‌సర్క్యూట్

- కాలిపోయిన కంప్యూటర్లు, ఫర్నీచర్


కాలిపోయిన పరికరాలను పరిశీలిస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి కంప్యూటర్లు, ఫర్నిచర్ కాలిపోయాయి. కళాశాలలో నుంచి మంటలు రావడాన్ని గమనించిన వాచ్‌మెన్ అప్రమత్తమై నిర్వాహకులకు సమాచారం అందించాడు. అక్కడకు చేరుకున్న వారు అగ్నిమాపక సిబ్బందికి విషయం చేరవేశారు. హుటాహుటిన చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ఘటనలో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని నిర్వాహకులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి చేరుకుని ప్రమాదం తీరును అడిగి తెలుసుకున్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ రంగాపూర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతిచెందిన మహిళకు సుమారు 32-35 మధ్య వయసు ఉంటుందని, మృతురాలు మతిస్థిమితం లేని స్థితిలో ఉందన్నారు. శనివారం రాత్రి ప్రమాదం జరగగా మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురిలో భద్రపరిచినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు. సంఘటనపై ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

వలస కార్మికుడి ఆత్మహత్య

గంగాధర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒద్యారం క్వారీలో పనిచేస్తున్న వలస కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్ పటేల్(25) కొద్దిరోజులుగా ఒద్యారం గ్రానైట్ క్వారీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పది రోజుల నుంచి పనిచేయడం ఇష్టలేక తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్లు తెలిపినా వారు పనిలోనే ఉండాలని సూచించారు. పని చేయడం ఇష్టంలేక తల్లిదండ్రులు ఇంటికి రావద్దన్న మాటలకు మనస్తాపంతో గ్రానైట్ క్వారీ సమీపంలో ఆదివారం చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కన్యలాల్ పటేల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


అజయ్(ఫైల్)

ధర్మారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని ఖానంపల్లి గ్రామానికి చెందిన గడ్డం అజయ్ (22) ఓ అమ్మాయిని ప్రేమించగా ఆమె పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపానికి లోనై అజయ్ గతనెల 29న పురుగుల మందు తాగాడు. చికిత్సనిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆదివారం మరణించాడు. అజయ్ తండ్రి గడ్డం ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఏపీ-20 వై 7659 ఆటో ట్రాలీలో 20సంచుల్లో తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న డ్రైవర్ కర్రు సమ్మయ్యను విచారించగా బిట్టుపల్లి గ్రామానికి చెందిన కాసు రాజు, ఓదెలు చెప్పిన విధంగా బియ్యాన్ని మహారాష్ట్రలోని సిరోంచకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో గంజాయి విక్రయిస్తున్న శాస్త్రినగర్‌కు చెందిన వేముల శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వేముల శ్రీనివాస్ గోదావరిఖనిలోని ఓ హోటల్లో పని చేస్తున్నాడు. అతని చిన్న కుమారుడు చంద్రప్రకాష్ మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో పని చేస్తున్నాడు. అతని ద్వారా గంజాయి సుల్తానాబాద్‌లోని శ్రీనివాస్ ఇంటికి చేరవేస్తున్నాడు. దానిని శ్రీనివాస్ ఈ ప్రాంతంలోని వలస కూలీలకు, యువతకు చిన్న చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్నాడు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా శ్రీనివాస్ గంజాయితో పట్టుబడ్డాడు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని మెడికల్ షాపులో దొంగతనానికి పాల్పడ్డ దొంగను పోలీసులు పట్టుకున్నారు. శాస్త్రినగర్‌కు చెందిన వేముల భవాని ప్రకాష్ అలియాస్ బబ్లూ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. శనివారం శివశంకర్ మెడికల్ స్టోర్ షటర్ కు వేసి ఉన్న తాళాన్ని పగులకొట్టి లోపలికి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.24 నగదు, సెల్ ఫోన్‌ను చోరీ చేశాడన్నారు. నిందితుడిని పట్టుకుని అతని వద్ద నుంచి రూ.18 వేల నగదు సెల్ ఫోన్ రికవరీ చేశామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు.



బీర్‌పూర్‌లో అలజడి

బీర్‌పూర్ గ్రామం

- **వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో.. మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామంలో ఆందోళన**
- **ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని గుబులు**

బీర్‌పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో జరుగుతున్న వరస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ముప్పాల లక్ష్మణ్‌రావ్ అలియాస్ గణపతి స్వగ్రామం బీర్‌పూర్‌లో అలజడి నెలకొంది. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుం దోనని జగిత్యాల జిల్లా బీర్‌పూర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన బల్మూరి నారాయణరావ్ అలి యాస్ క్యాడర్ ప్రభాకర్ 2024 డిసెంబరు 23న అరెస్టు అయ్యాడు. 2025 జనవరి 21న ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో గరియాబండ్ జిల్లా కుల్హాడీఘాట్ అటవీప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాప్ రెడ్డి అలి యాస్ చలపతి అలియాస్ జయరాం(62)తో పాటు ఒడిశాలో మావోయిస్టు పార్టీ కీలకనేత మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ(ఎస్‌జడ్‌సీ) సభ్యుడు గుడూలతో పాటు మరికొంతమంది మావోయిస్టులు మృతి చెందారు.ఈ వార్త తెలిసిన గ్రామస్థులు గణపతి ఎలా ఉన్నాడో, ఎక్కడ ఉన్నాడో అని నిత్యం చర్చించుకుంటున్నారు.

● ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉద్యమం వైపు..

మావోయిస్టు అగ్రనేత ముప్పాల లక్ష్మణ్‌రావ్ అలియాస్ గణపతి జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో ముప్పాల గోపాల్‌రావ్-శేషమ్మ దంపతులకు 1949వ సంవత్సరం జూన్16న నాలుగో సంతానంగా జన్మించాడు. గణపతి అన్నయ్య నర్సింగారావ్ హైదరాబాద్‌లో ఉండగా తమ్ముడు రాంచందర్‌రావ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ మృతి చెందాడు. గణపతికి ఇద్దరు అక్కలు ఉన్నారు. గణపతికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాగినేడుకు చెందిన విజయతో వివాహం జరగ్గా కుమారుడు శ్రీనివాసరావ్ ఉన్నాడు. గణపతి విదేశాలకు వెళ్లి వచ్చి ఇంజనీరింగ్ ఉద్యోగం చేస్తున్నాడని తెలిసింది. గణపతి మూడో తరగతి వరకు బీర్‌పూర్‌లో చదివిన అనంతరం కరీంనగర్ జిల్లాలోని అమ్మమ్మ గ్రామమైన గంగిపెల్లిలో 7వ తరగతి వరకు చదివాడు. జగిత్యాలలో 7వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యను అభ్యసించాడు. కరీంనగర్‌లోని రాజరాజేశ్వర కాలేజీలో బీఎస్సీ పూర్తి చేశాడు. 1970లో ప్రభుత్వ ఉపాధ్యా యుడిగా ఉద్యోగం సంపాదించి కరీంనగర్ జిల్లా లోని ఎలగందులలో మొదట పోస్టులో చేరారు. ఆ తరువాత ఎలిగేడులో కొంతకాలం పనిచేశాడు. అనంతరం రుద్రంగికి బదిలీపై వెళ్లిన ఆయనను బీఈడీ ట్రైనింగ్ నిమిత్తం వరంగల్ జిల్లాకు పంపగా పంపగా అక్కడ మావోయిస్టు నాయకులు నల్లా ఆదిరెడ్డి మరియు కొండపల్లి సీతారామయ్యలతో పరిచయం ఏర్పడింది. చివరికి వారి భావాలకు ఆకర్షితుడై మావోయిస్టు ఉద్యమంలో చేరాలని నిర్ణయించుకున్నాడు. అతడు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్-లెనినిస్ట్) పీపుల్స్ వార్ గ్రూప్ యొక్క ప్రారంభ సభ్యులలో ఒకడు. ఇప్పుడు విలీనమైన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) అని పిలువబడే పార్టీకి కేంద్రకమిటీ ప్రధాన కార్యదర్శి స్థాయికి గణపతి అంచెలంచెలుగా ఎదిగాడు. గణపతి లొంగిపోవాలని 2013లో బీర్‌పూర్‌లో అప్పటి ఎస్పీ శివకుమార్ ఆధ్వర్యంలో అంతర్మథనం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో బస చేశారు.

చిన్నప్పుడు ఎవరినీ ఏమీ అనేవాడు కాదు

-బింగి నర్సయ్య, బీర్‌పూర్



చిన్నపుడు మేము చదువుకునే సమయంలో లక్ష్మణ్‌రావ్ అందరితో మంచిగానే ఉండేవాడు. ఎవరితో కొట్లాడేవాడు కాదు. మాతో పాటు హన్మండ్ల గుడి వద్ద ఉన్న బడిలో చదువుకున్నాడు. లక్ష్మణ్‌రావ్ నాకంటే ఒక్క తరగతి పెద్ద. అందరం కలిసి ఆడుకునే వాళ్లం.

● బీర్‌పూర్‌లో పోటాపోటీ స్తూపాలు

పోలీసుల చేతుల్లో మావోయిస్టులు మృతిచెందారని అప్పట్లో మావోయిస్టు దళాలు జగిత్యాలకు వెళ్లే బస్టాండ్ వద్ద ఎర్ర స్తూపాన్ని నిర్మించారు. మావోయిస్టుల చేతిలో అమరులైన 43 మంది పేరు మీద పోలీసులు ధర్మపురి వెళ్లే బస్టాండ్ వద్ద శాంతిస్తూపాన్ని నిర్మించారు. ఉమ్మడి సారంగాపూర్ మండలంలో 22 గ్రామాలు ఉండేవి. 11గ్రామాలతో గణపతి స్వగ్రామాన్ని బీర్‌పూర్ మండల కేంద్రంగా ప్రకటించారు. ప్రస్తుతానికి బీర్‌పూర్ గ్రామంలో మావోయిస్టు ప్రభావం పూర్తిగా తగ్గిపోవడంతో యువకులు ఆర్మీ, ఇండియన్ నేవీ, సివిల్ పోలీస్ కొలువులు సాధిస్తున్నారు. గ్రామంలో సుమారు 15 మంది వరకు పోలీస్ శాఖలో ఉద్యోగాలు చేస్తున్నారు.


పోలీసులు నిర్మించిన శాంతిస్తూపం

పారుతున్న బిక్కవాగు.. రైతుల్లో ఆనందం

- యాసంగి పంటలకు ఇబ్బంది ఉండదంటున్నరైతులు - నాలుగు వేల ఎకరాలకు ప్రయోజనం


ఇల్లంతకుంటలో ప్రవహిస్తున్న బిక్కవాగు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అనంతారం ప్రాజెక్టు దిగువన ఉన్న బిక్కవాగు ప్రవహిస్తుండటంతో యాసంగి పంటలకు ఇబ్బంది తొలగిపోయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.93 టీఎంసీల నీరు ఉంది. దీంతో స్థానిక రైతుల వినతుల మేరకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులతో మాట్లాడి అనంతారం ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయించారు.

ప్రాజెక్టు నిండి మత్తడి దూకడంతో దిగువన ఉన్న బిక్కవాగు పారుతోంది. ఓవైపు ఫీడర్ ఛానల్ ద్వారా రహీంఖాన్‌పేట గ్రామంలోని సింగరాయకుంటకు నీరు చేరుతూ, మరోవైపు దిగువ ప్రాంతానికి నీరు వస్తోంది. జంగమరెడ్డిపల్లె, అనంతారం, ఇల్లంతకుంట, వంతడుపుల, నర్సక్కపేట, జవారిపేట గ్రామాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు ప్రయోజనం కలుగుతుంది. బిక్కవాగు సమీపంలోని రైతులందరు వరిపంటను సాగుచేశారు. వరిలో కలుపు తీసి రెండవసారి ఎరువులు చల్లుతున్నారు. ప్రస్తుత దశలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని, ఇలాంటి సమయంలో బిక్కవాగు పారుతుండటం వల్ల ఇబ్బందులు తొలగినట్లేనని, అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను మరింత పెంచితే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

● యాసంగి పంటకు ఇబ్బంది తొలగిపోతుంది..

- దయ్యాల కనుకయ్య, రైతు ఇల్లంతకుంట



బిక్కవాగు పారుతుండటంతో యాసంగి పంటకు ఎదురయ్యే ఇబ్బంది తొలగిపోతుంది. వరిచేను కలుపుతీయడం వల్ల నీరు ఎక్కువగా తాగుతుంది. ఎండల వల్ల బావులు, బోర్లలో నీరు రోజురోజుకు తగ్గుతోంది. పదిహేను రోజుల పాటు వాగుపారితే రైతులకు ఉపయోగం ఉంటుంది. బిక్కవాగు పారితే ఎనిమిది గ్రామాల రైతులు లాభపడతారు. బిక్కవాగులోని ముళ్లపొదలను తొలగించి, వ్యర్థాలను వేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

● నీటి విడుదలతో ప్రయోజనం..

- పారిపెల్లి మధుసూదన్‌రెడ్డి, రైతు జంగమరెడ్డిపల్లె



అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి అనంతారం ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ప్రాజెక్టు దిగువన ఉన్న బిక్కవాగు పారుతుండటం భూగర్భ జలాలు పెరుగుతాయి. రైతుల పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ నీటిని విడుదల చేయించడం సంతోషకరం. ఎక్కువ మొత్తంలో నీటి విడుదల చేసినట్లయితే మరింత ప్రయోజనం కలుగుతుంది.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్ట్

ఐదు ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం -వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


నిందితులను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో వరుసగా చోరీలకు పాల్పడుతున్న ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను ఆదివారం జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు త రలించారు. జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాల ను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన జక్కుల గోపాల్, సింగంరాజు, నేరెళ్ల నరేష్, సంపతి కుమారస్వామి, బుర్రరాజేందర్ జల్సాలకు అలవాటు పడి ఒక ముఠాగా ఏర్పడ్డారు. జక్కుల గోపాల్‌కు చెందిన ఓ కారులో రాత్రి సమయాల్లో తిరుగుతూ ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్నారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామంలో గత డిసెంబరులో బైక్ దొంగిలించారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని వెల్గనూర్ గ్రామంలో మరో బైక్‌ను, చిన్నబెల్లాల్ గ్రామంలోని ఇంటి ముందు పార్కు చేసిన మరో బైక్‌ను, జగిత్యాల మండ లం తిప్పన్నపేట, దండేపల్లి మండలంలోని ద్వారకానగర్‌లో ఇంటిముందర పార్కు చేసిన రెండు బైక్‌లను దొంగతనానికి పాల్పడ్డారు. దొంగిలించిన బైక్‌లను తమ ఇంటి వద్ద దాచి పెట్టినట్లు నిందితులు ఒప్పుకున్నారు. జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన భారతపు పెద్దిరాజం బైక్ అపహరించడంతో జగిత్యాల రూరల్‌స్టేషన్‌లో బాధితుడు జనవరిలో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసు లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా ఆదివారం తిప్పన్నపేట గ్రామ శివారులో కారులో వస్తున్న ఐదుగురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు పట్టుబడ్డారు. నిందితులను పట్టుకున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సధాకర్, కానిస్టేబుల్‌లు శ్రీనివాస్, గంగాధర్, రాహుల్, ఉమర్, మోహన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

కడుపు నొప్పి భరించలేక వృద్ధుడి ఆత్మహత్య


అమరగొండ వీరయ్య(ఫైల్)

సైదాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మం డలంలోని వెన్కేపల్లి గ్రామానికి చెందిన అమరగొండ వీరయ్య (75) అనే వృద్ధుడు కడుపునొప్పి భరించలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వీరయ్య-రాజమ్మ దంపతులు ఓ ఇంటిలో ఉంటున్నారు. శనివారం రాజమ్మ ఐనవోలు జాతరకు వెళ్లడంతో ఇంట్లో వీరయ్య ఒక్కడే ఉన్నాడు. వీరయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం సాయంత్రం పెద్ద కుమారుడు అమరగొండ రాజయ్య కథ చెప్పేందుకు వేరే ఊరికి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం సుమారు 9 గంటల ప్రాంతంలో చిన్న కుమారుడు మల్లేష్ తన తండ్రి వీరయ్య వద్దకు వెళ్లి అతడు భోజనం చేసే వరకు ఉండి తన ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం అమరగొండ మల్లేష్ పాలు ఇచ్చేందుకు తనతండ్రి వద్దకు వచ్చి ఇంట్లో చూడగా తన తండ్రి కనిపించలేదు. దాంతో చుట్టుపక్కల వాళ్లను అడుగగా తెలియదని చెప్పారు. చుట్టుపక్కల, బావులలో వెతుకగా అమర గొండ కొమురయ్య చేదబావిలో శవమై కనిపించినట్లు తెలిపారు. తన తండ్రి అమరగొండ వీరయ్యకు కొంతకాలంగా కడుపు నొప్పి ఉన్నదని, ఈ మధ్యనే ఆస్పత్రిలో చూపించగా ఆపరేషన్ చేయాలని డాక్టర్ చెప్పాడని మృతుడి చిన్న కుమారుడు మల్లేష్ తెలిపాడు. కడుపు నొప్పి భరించలేక రాత్రి ఎవరు లేని సమయంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని మృతుడి చిన్న కుమారుడు అమరగొండ మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

మామ లైంగికంగా వేధిస్తున్నాడని కోడలు నిరసన

- తల్లిదండ్రులు, కొడుకుతో కలిసి బైఠాయింపు

మంథని, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కోడలును కన్న కూతురిలా చూసుకోవాల్సిన మామ లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని పెద్దపల్లి జిల్లా మంథని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం కోడలు నిరసన వ్యక్తం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన యువతికి నాలుగేళ్ల క్రితం పోచమ్మవాడకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉండగా ప్రస్తుతం యువతి ఏడు నెలల గర్భవతి. కాగా మామ తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని, భర్త సైతం తండ్రి చెప్పినట్లు సహకరించాలంటున్నాడని ఆరోపణలు చేసింది. అదనపు కట్నం కోసం మామ, అత్త, భర్త వేధింపులకు గురి చేయడంతోపాటు గత నెల 12న ఇంట్లో నుంచి గెట్టివేయగా మంథని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు పోలీసు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. స్టేషన్‌లో ఫిర్యాదు తర్వాత తాను ఖమ్మంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లినట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం భర్త తన సెల్‌ఫోన్‌కు ఓ అమ్మాయి ఫోటోను పంపి ఆమెను పెండ్లి చేసుకుంటున్నానని, నీతో, నీకు పుట్టిన పిల్లలతో నాకు సంబంధం లేదని చెప్పినట్లు పేర్కొంది. దీంతో ఆదివారం మంథనికి వచ్చిన యువతి తల్లిదండ్రులు, కొడుకుతో కలిసి బైఠాయించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను, కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా గత నెల 12న అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారన్నారు. ఆమె ఖమ్మంకు వెళ్లడంతో కౌన్సెలింగ్ పిలిచినా రాలేదని పేర్కొన్నారు. మామ, భర్త లైంగిక వేధింపులపై ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్లు



చొప్పదండి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రహదారిపై ఎక్కడైనా ప్రమాదం జరగగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది 108 టోల్‌ఫ్రీ నంబర్. 108కు ఫోన్ చేయగానే అంబులెన్స్ వచ్చి ప్రమాద బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్తుంది, ఆపదలో సహాయపడుతుంది. ఇదే విధంగా పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు 100నంబర్‌కు డయల్‌చేసి ఫిర్యాదు చేస్తాం. ఇవన్నీ అత్యవసర సమయంలో మనకు గుర్తుకు వచ్చే నంబర్లు. ఇదే విధరంగా ఇతర అనేక రకాల సేవలకు వివిధ నంబర్లు ఉన్నాయి. అత్యవసరంలో టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయగానే సేవలు అందుబాటులోకి వస్తాయి, సమస్యలు పరిష్కారం అవుతాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక సేవల కోసం ఉన్న టోల్‌ఫ్రీ నంబర్ల వివరాలు మీ కోసం...

అగ్నిమాపక సేవల కోసం 101
అగ్నిప్రమాదాలు సంబవించినప్పుడు ఫైరింజన్ కోసం 101 నంబర్‌కు ఫోన్ చేస్తే ప్రమాద స్థలానికి ఫైరింజన్‌ను పంపిస్తారు.

సంచార వైద్యం కోసం 104
రైతు మంగిటే పశువుల వైద్యానికి 104 అంబులెన్స్ వాహనం సంచార వైద్యశాలగా ఉపయోగపడుతుంది.

రైల్వే సమస్యల కోసం 139
రైలులో ప్రయాణించేటప్పుడు, ఇతర సమస్యల కోసం 139 నంబర్‌కు ఫోన్ చేస్తే అధికారులు సమస్యలను పరిష్కరిస్తారు.

టెలికాం సేవల కోసం 198
దేశవ్యాప్తంగా మొబైల్ నెట్‌వర్కింగ్ సేవలో అంతరాయం ఏర్పడిన, వినియోగదారుల సమస్యలు, సందేహాలే తీర్చడానికి ఈ నంబర్ ఉపయోగపడుతుంది.

ఆపదలో ఉన్న మహిళల కోసం 1091
ఈ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఆపదలో ఉన్న, వేధింపులకు గురైన మహిళలు సహాయం పొందవచ్చు.

పిల్లలను వేధిస్తే, బాల కార్మికులను గుర్తిస్తే 1098
6 నుంచి 14సంవత్సరాల పిల్లలు వేధింపులకు గురైనా, బాలకార్మికులను గుర్తించినా 1098 నంబర్‌కు కాల్‌చేసి సమాచారం అందిస్తే అధికారులు వారిని చేరదీస్తారు.

ఓటరు నమోదు, తదితర సమస్యల పరిష్కారానికి 1950
ఎన్నికలు, ఓటర్ల జాబితాలో వ్యక్తిగత సమాచారం, ఓటింగ్ తేదీలు, పోలింగ్‌స్టేషన్ వివరాలు తెలుసుకోవచ్చు. ఫిర్యాదుల పరిష్కారానికి కాల్ చేయవచ్చు.

మీ సేవలో సమాచారం, సమస్యల పరిష్కారం 1100
ఈ టోల్ ఫ్రీ నంబర్‌ను మీసేవా కాల్ సెంటర్‌గా ఉపయోగిస్తారు. రాష్ట్రంలోని ప్రజలు ఫిర్యాదులు, సూచనల కోసం ఈ నంబర్‌ను ఉపయోగించవచ్చు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912
విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ఇతర సమస్యలు ఎదురైతే ఈ నంబర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చు.

వినియోగదారుల సేవల కోసం జాతీయ హెల్ప్‌లైన్ 1915
వినియోగదారులు ఏదైనా ఉత్పత్తి, సేవపై సులభంగా ఫిర్యాదు చేయడానికి, ఫిర్యాదులను ట్రాక్ చేయడానికి ఈ టోల్ ఫ్రీ నంబర్ వీలు కల్పిసుంది.

వ్యవసాయ సమాచారం, సమస్యలపై కిసాన్ కాల్ సెంటర్ 1800-1801551
వ్యవసాయంలో సలహాలు, సూచనలు కోసం రైతులు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. వాతావరణ వివరాలను సైతం తెలుసుకోవచ్చు.

మహిళల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ 181
గృహహింస వరకట్న వేధింపులు, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు వంటి పరిస్థితుల్లో ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. మహిళలు అందుబాటులో ఉన్న సహాయ సేవలు, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి తెలుసుకోవచ్చు.

ఉపాధి హామీ పనులలో సమస్యలు పరిష్కారం కోసం 1800-2001001
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సమస్యలు, వేతనాల కోసం కూలీలు ఈ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930
సైబర్ నేరగాళ్లకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

టీఎస్ఆర్‌టీసీ సేవల కోసం 040-69440000
బస్సు ప్రయాణంతో పాటు ఇతర సమస్యలకు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులకు సమస్య చేరి దాని పరష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



కనుకులగిద్దె గ్రామంలో సాగు వివరాలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్న యువ రైతు

సోషల్ మీడియా సాయంతో వ్యవసాయం

- సామాజిక మాధ్యమాలను అనుసరిస్తున్న యువ రైతులు
- ఆధునిక పద్ధతుల్లో సాగుతో అధిక దిగుబడులు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా యువ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. గ్రామాల్లో యువ రైతులు సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతున్నారు. వ్యవసాయానికి సంబంధించి కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. పంటల సాగులో కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఆధునిక పద్ధతులు ఏవి.. అధిక దిగుబడులు ఎలా సాధించాలి.. ఏ సీజీన్లలో ఏ కూరగాయాలు పండించాలి.. ఏ కాలంలో విత్తనాలు వేసుకోవాలి, పంట వివిధ దశల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలేంటి.. సాగులో యంత్రాల వినియోగం ఎలా..మార్కెట్లో వేటికి డిమాండ్ ఉంటుంది.. తదితర విషయాలను యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా



జూపాక గ్రామంలో సాగు పనుల వివరాలను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తున్న యువ రైతు

తెలుసుకొని ఆచరణలో పెడుతున్నారు. అధిక దిగుబడులను సాధిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.

● వీడియోలు, పోస్టుల ద్వారా కొత్త విషయాలు

వివిధ రాష్ట్రాల్లో రైతులు సాగు చేస్తున్న కూరగాయలు, ఇతర పంటలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్ వీడియోలు, ఫేస్‌బుక్‌లో పోస్టులు పెడుతున్నారు. వాటిని ఫాలో అవుతూ కొత్త విషయాలను రైతులు తెలుసుకుంటున్నారు. తమకు అవసరమైన సమాచారాన్ని వెతికి సేకరించుకుంటున్నారు. వాటిపై అవగాహన పెంచుకుని ఆచరణలో పెడుతున్నారు. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని తెలుసుకుంటున్నారు. కలుపు తీసే యంతా్రలు, క్రిమిసంహారక మందులు చల్లే డ్రోన్లు, పొలం దున్నేవి, పంటలు కోసే యంత్రాల గురించి తెలుసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన రైతుల వీడియోలను స్థానిక రైతులు చూస్తూ కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు.

సోషల్ మీడియా ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవచ్చు

-జొంగోని అనిల్, యువ రైతు, జూపాక



నేను చాలా కాలంగా సోషల్ మీడియా ఫాలో అవుతూ పంటల సాగులో కొత్త విషయాలను తెలుసుకుంటున్నాను. యూట్యూబ్‌లో వివిధ రకాల సాగు పనులు, మెళవకులు తెలుసుకుంటున్నాను. వాటిని అనుసరిస్తున్నాను. వ్యవసాయంలో స్మార్ట్‌ఫోన్ బాగా ఉపయోగపడుతోంది. పాడి గేదెల పెంపకం, అధిక పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన వీడియోలను చూసి ఆచరిస్తున్నాను.

మొదట్లో ఇబ్బంది పడ్డాను..

-బొల్లవేణి శ్రావణ్‌కుమార్, యువ రైతు, కందుగుల



వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు తెలియక మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాను. నేను అందరి లాగా పంటలను సాగు చేసేవాడిని. ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, వాట్సాప్ గ్రూప్‌లలో సాగుకు సంబంధించిన వీడియోల ద్వారా పలు విషయాలు తెలుసుకొని సాగు పనులు చేస్తున్నాను. నాకు తెలిసిన వారికి కూడా పంట సాగు వివరాలను తెలియజేస్తున్నా. కొత్త మెళకువలతో సాగు చేసిన రైతుల ఫోన్ నంబర్లు తీసుకొని వారితో మాట్లాడుతున్నాను. వారి సూచనలు, సలహాలతో పంటలు సాగు చేస్తూ దిగుబడి పొందుతున్నాను.

కొండగట్టు క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్సీ కవిత
- అంజన్న సన్నిధిలో పూజలు

మల్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయస్వామి క్షేత్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అభివృద్ధి చేయాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఆలయ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపొందించి అమలుకు కృషి చేసిందన్నారు. ప్రభుత్వం మారినందన అభివృద్ధి ఆగిపోకుండా గత ప్రణాళిక అమలు చేయాలని లేకుంటే అంత కన్నా మెరుగైన ప్రణాళికతో కాంగ్రెస్ ప్రభుత్వం దేవస్థానం అభివృద్ధి చేయాలని ఆమె అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ కవిత కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత

అనంతరం ఆమె మాట్లాడుతూ కొండగట్టుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తూంటారని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొండగట్టు అభివృద్ధికి మెట్లదారి, కోనేరు, షెడ్లు, దీక్ష విరమణ మండపం పనులు చేపట్టిందన్నారు. రూ.25 కోట్లతో వరదకాలువ నుంచి నీటిని తరలించి కొండపై శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను వచ్చే హనుమాన్ జయంతిలోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొండగట్టు ఘాట్ రోడ్డు అభివృద్ధి పనులపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన్నట్టు వ్యవహరిస్తోందని కవిత ఆరోపించారు. ఎమ్మెల్సీ వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీలు రామ్మోహన్‌రావు, ప్రశాంతి, విండో చైర్మన్ సాగర్‌రావు, బద్దం తిరుపతిరెడ్డి, కొంక నర్సయ్య, కోటేశ్వర్‌రావు, సురేందర్ ఉన్నారు.

'కులగణనలో బీసీ జనాభా తగ్గడం పెద్ద కుట్ర'

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో బీసీ జనాభా తగడం వెనక పెద్ద కుట్ర జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీసీ భవంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పర్శహన్మాండ్లు మాట్లాడారు. బీసీ కులగణన బీసీలకు అమృతం అవుతుందని అనుకున్నామని కాని అసెంబ్లీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పెట్టిన కులగణన లెక్కలు, ఆయన మాట్లాడిన తీరును బట్టి చూస్తే బీసీ కులగణన అనేది బూడిదలో పోసిన పన్నీరు అయిందన్నారు. 2014లో బీసీల జనాభా 51 శాతం ఉంటే 2024 సంవత్సరంలో 46 శాతానికి తగ్గడం వెనకాల పెద్ద కుట్ర దాగి ఉందని అనుమానాలను వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

- భారీగా తరలి వచ్చిన భక్తులు

బీర్‌పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణ వేడుకలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను శావలో ఆలయం చుట్టు ప్రదక్షణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వేర్వేరు సమయాల్లో స్వామి వారిని దర్శించుకున్నారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.



కల్యాణానికి భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

ఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కల్యాణ వేడుకల్లో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావు, కొల్వాయి సింగిల్‌విండో చైర్మన్ నవీన్‌రావ్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు పాత పద్మ రమేష్, ఆలయ మాజీ చైర్మన్‌లు ఎనగంటి స్వామ్రాట్, నేరెల్ల సుమన్‌గౌడ్, గోనె రమణ రావు , మాజీ జడ్పీటీసీ సభ్యులు ముప్పాల జలజ, కొల్మూల రమణ, ఆల య ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్, మదు కుమార్, చిన్న సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగ, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తా

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగంతో పాటు నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలో ఆత్మీయ సమ్మేళన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి 55వేల నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూనివర్సిటీలకు తగిన నిధులిచ్చారన్నారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. సమావేశంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, మహిళా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సత్యప్రసన్నరెడ్డి, కౌరు సుగుణాకర్‌రెడ్డి, శంకర్, బాబు, కిరణ్‌కుమార్, పుష్పలత, రాహుల్, రాజు, లావణ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్, రత్నం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థించిన ఎమ్మెల్సీ అభ్యర్థులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ఆదివారం ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన పోరాడిన పార్టీ అభ్యర్థులను ఆదరించాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తే ఏమీ చేయలేదనే భావన ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఉందని, పట్టభద్రులు, విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలకోసం పోరాడింది బీజేపీ మాత్రమేనని అన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు చూపుతున్న ఆదరణ, విశ్వాసాన్ని మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తామన్నారు. మొదటి ప్రాధాన్య ఓటును బీజేపీ అభ్యర్థులకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ వై సునీల్‌రావు, వైద రామాను, బండ రమణారెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, కొండాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

పట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే పోటీ

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను సన్మానిస్తున్న పట్టభద్రులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, నిరుద్యోగ పట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే తాను ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఆదివారం హుజూరాబాద్, జమ్మికుంటలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులకు అనేక సమస్యలు ఉన్నాయని, విద్యా వ్యాపారం చేసే వ్యక్తులకు వారి సమస్యలపై అవగాహన లేదన్నారు. విద్యా వ్యాపారాన్ని చేస్తున్న వ్యక్తి రాజకీయాల్లోకి వచ్చి పట్టభద్రుల గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. తనకు విద్యారంగ ప్రొఫెసర్‌గా పట్టభద్రుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. యువత, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తునన్నారు. హుజూరాబాద్, జమ్మికుంటలోని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ మద్దతు తెలపడం అభినందనీయమన్నారు.

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ నామినేషన్లు

- రేపు పరిశీలన, 13న ఉపసంహరణ
- 27న పోలింగ్... మార్చి 3న ఓట్ల లెక్కింపు
- భారీ ర్యాలీలకు అభ్యర్థుల సన్నాహాలు

కరీంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారం ముగియనున్నది. ఈ నెల 11న నామినేషన్లను పరిశీలించి అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ తీవ్రంగా ఉంది. ఓటర్ల నమోదు కార్యక్రమం నుంచే పోటాపోటీగా ఓటర్ల నమోదు చేయించుకోవడంతోపాటు ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈనెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 58 మంది అభ్యర్థులు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లను దాఖలు చేశారు. వీరిలో 49 మంది పట్టభద్రుల స్థానానికి, తొమ్మిది మంది ఉపాధ్యాయ స్థానానికి నామినేషన్లను వేశారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగియనుండడంతో చివరి రోజున పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేస్తారని భావించిన అధికార యంత్రాంగం కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. చివరిరోజు పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డితోపాటు మరికొందరు అభ్యర్థులు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కూడా భారీ ర్యాలీలు నిర్వహించి నామినేషన్లను దాఖలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పెగడపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుమోటలపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి నర్సింహాచారి అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహాచారి పెగడపల్లి గ్రామంలో నివాసముంటూ ఆదివారం రాత్రి వ్యవసాయ పనుల్లో భాగంగా తన పశువులను కట్టేసి హెచ్‌పి పెట్రోల్ పంపు సమీపంలో కాలినడకన వెళ్తున్నాడు. ఇదేసమయంలో అటువైపుగా వెళ్తున్న నేదరి సాయికృష్ణ అనే వ్యక్తి కారుతో ఢీకొట్టగా తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. కాగా నర్సింహాచారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సీహెచ్ రవికిరణ్ తెలిపారు.

ఆర్థిక సహాయం

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లల చదువుకు జగిత్యాలకు చెందిన సామాజిక సేవకుడు సూరజ్ శివ శంకర్ ఆర్థిక సహాయం అందజేశాడు. కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం మల్లుపెల్లికి చెందిన పిల్లలు సాహిత్య, సాత్విక్‌ల తండ్రి మాలే నారాయణ భార్య లక్ష్మి చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. పిల్లల తల్లి జైలుకు వెళ్లింది. విషయం తెలుసుకున్న శివ శంకర్ పిల్లలకు రూ.10 వేల నగదును అందించారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

ఎండపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన సందవేణి శ్రీవాణి(20) అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు.. కొండాపూర్ గ్రామానికి చెందిన సందవేణి శ్రీనివాస్‌కు ముగ్గురు కుమార్తెలు. శ్రీవాణి చిన్నకూతురు. మిగతా ఇద్దరు అక్కలకు వివాహాలు అయ్యాయి. శ్రీవాణి ధర్మారంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

విహారయాత్రకు తరలిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

కథలాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని 15 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ఆదివారం ట్విన్నింగ్ ప్రోగ్రాంలో భాగంగా విహార యాత్రకు తరలివెళ్లారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్-1లో టాపర్లుగా నిలిచిన ప్రతీ పాఠశాలలోని మొదటి ఇద్దరు విద్యార్థులను ఈ యాత్రకు తీసుకువెళ్లారు. బాసర, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్, హన్మాన్ దేవాలయం, పునరుజ్జీవ పంప్ హౌజ్‌లను పరిశీలించారు. ఈ విహార యాత్రల వల్ల పోటీతత్వం పెరగడమే కాకుండా వివిధ రంగాల్లో రాణించాలనే తపన ఏర్పడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానం పెరుగుతుందన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, విద్యార్థులు ఉన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు, కల్యాణాలు


సంగెంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


నల్లగొండలో క్యూలైన్‌లో భక్తులు

కొడిమ్యాల, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో బాగంగా రెండవ రోజు స్వామి వారికి హోమం నిర్వహించారు. శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం సోమవారం నిర్వహించటానికి ముహూర్తం నిర్ణయించగా ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ ఈవో ఉడుతల వెంకన్న ఆదివారం తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండ విద్యుత్, తాగు నీటి, చలువ పందిళ్ళ ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి విజయవంతం చేయాలని కోరారు. ఎగువ, దిగువ ఆలయాల్లో సుమారు 3వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో బాగంగా రెండవ రోజు కొడిమ్యాల ఎస్సై సందీప్, ఈవో వెంకన్న ఎగువ, దిగువ ఆలయ పరిసరాలను పరిశీలించారు.

●నల్లగొండ గ్రామ శివారులోని శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సీసీ కెమెరాలను, క్యూలైన్‌లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

సీతారాముల కల్యాణం

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగెంలో ఆదివారం సీతారామాలయంలో స్వామివారల కల్యాణం కమనీయంగా జరిగింది. కళ్యాణం వీక్షించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

మల్యాల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మానాల శివారులో నల్లగుట్టపై గలలక్ష్మీనరింహస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి జాతర

కథలాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భూషణరావుపేటలో ఆదివారం మల్లికార్జునస్వామి జాతరోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి చుట్టు పక్కన గ్రామాలైన ఊట్‌పల్లి, చింతకుంట, పెగ్గెర్ల, కథలాపూర్ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ ఆలయం వద్ద పోతరాజులు, యాదవ సంఘ సభ్యులు పూజలు నిర్వహించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

మేడిపల్లి : పోరుమల్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ రోజు జరిగిన స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, నరేష్‌రెడ్డి, బొంగోని రాజాగౌడ్, నర్సయ్య, రావుశ్రీనివాస్‌రావు, గోపు రాజారెడ్డి, అనంద్, శంకర్ పాల్గొన్నారు.

విప్ పూజలు

భీమారం: మండలంలోని గోవిందారం గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహేంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, మేడిపల్లి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, ఉపాధ్యక్షుడు తోకల నర్సయ్య, మాజీ సర్పంచులు తేలు నరేష్, బొంగోని రాజా గౌడ్, అంగడి ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.


భూషణరావుపేటలో బోనాలతో మహిళలు

'యువకులు క్రీడల్లో రాణించాలి'



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

కోరుట్ల,ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణ కాలేజీ గ్రౌండ్‌లో జరుగుతున్న మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు స్మారక కోరుట్ల ప్రైమరీ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా వచ్చారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు స్పాన్సర్‌గా వ్యవహరించారు. అల్ మదీన, రాయల్ కింగ్ జట్లు తలపడగా హోరహోరిగా జరిగిన మ్యాచ్ రాయల్ కింగ్ జట్టు గెలుపొందింది.విజేతలుగా నిలిచిన జట్టుకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జువ్వాడి నర్సింగరావులు బహుమతులు అందజేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ యువకులు క్రీడాల పట్ల ఆసక్తి కనబర్చాలని అన్నారు. క్రీడాల్లో రాణించిన వారికి ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు.

జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ క్రీడాల వల్ల మానసికంగా శారీరకంగా ధృడంగా ఉంటారన్నారు. యువకులు క్రీడాల పట్ల అసక్తి పెంచుకోవాలని అన్నారు. క్రీడాలలో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఎంపిక కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తిరుమల గంగాధర్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనారయణ, మార్త బాలరాజు, మోయిజ్, మోసిన్, షబీర్ తదితరులు పాల్గొన్నారు.

పొలాలను సందర్శించిన విద్యార్థులు

కొడిమ్యాల, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలోని బాపు జగ్‌జీవన్‌రాం వ్యవసాయ కళాశాల బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థినులు 20 మంది ఆదివారం మండలం లోని పూడూర్, శ్రీరాములపల్లి గ్రామంలోని పంట పొలాలను సందర్శించారు. గ్రామీణ వ్యవసాయ పని అనుభవ పథకంలో బాగంగా కరీంనగర్ ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో పూడూర్, శ్రీరాములపల్లి గ్రామాల్లో సాగు చేసిన పాం ఆయిల్, చెరుకు తోటలు, వరి ఆడ మగ సాగు చేసిన పంట పొలాలను సందర్శించారు. పంటల సాగు విధానాలను ఆయా గ్రామాల్లోని రైతులను, వ్యవసాయ విశ్వ విద్యాలయం సలహ మండలి మాజీ సభ్యుడు, పూడూర్ మాజీ సర్పంచు వెల్లుమల రాంరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భన కార్యక్రమంలో రిటైర్డ్ ఏఈవో వెంకట్‌రెడ్డి, గ్రామాల ప్రముఖులు, రైతులు నరేందర్‌రెడ్డి, రవికరణ్‌రెడ్డి, బండ మహేందర్‌రెడ్డి, మడుపు మహేందర్ రెడ్డి, చింతపంటి హన్మయ్య ఉన్నారు.

ఓట్ల వేటలో ఎమ్మెల్సీ అభ్యర్థులు

(5వ పేజీ తరువాయి)

స్థానానికి పోటీ చేస్తున్న అంజిరెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ప్రసన్న హరి కృష్ణ తదితరులు స్థానిక నాయకులను కలిసి ప్రచార వేగాన్ని పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్న పలువురు ఇప్పటికే విస్తృత ప్రచారాలు నిర్వహిస్తున్నారు. జిల్లా పరిధిలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలతో పాటు ఆయా ప్రాంతాల్లో గల ఓటర్లను కలుస్తూ మద్దతు కోరుతున్నారు.

●ఓటర్లకు వాయిస్ కాల్స్, మెసేజ్‌లు

పట్టభద్రులు, టీచర్ల ఓటర్లకు అభ్యర్థుల పేర్లతో కూడిన వాయిస్ కాల్స్ వస్తున్నాయి. అభ్యర్థి పేరు చెబుతూ తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. వీటితో పాటు ఓటర్లకు బల్క్ మెసేజ్‌లు, వాట్సాప్ సందేశాలు షేర్ చేస్తున్నారు. ఒక్కో ఓటరుకు ప్రతీ రోజు కనీసం రెండు, మూడు ఫోన్ కాల్స్ మెసేజ్‌లు వస్తున్నాయని ఓటర్లు అంటున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి మరింత ఎన్నికలు ఖర్చులు పెరుగుతున్నట్లుగా సంబంధిత వర్గాలు అంటున్నాయి. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి మద్దతు ఇస్తారనేది ఆసక్తిగా మారింది. దీనికి తోడు ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడంతో అభ్యర్థులకు ఖర్చులు సైతం తడిసి మోపడవుతున్నాయి. అభ్యర్థుల మధ్య పోటీ పెరగడంతో విజయంపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

మాజీ కో-ఆప్షన్ సభ్యుడికి ఎమ్మెల్యే నివాళి


అంజన్నగౌడ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జగిత్యాల మున్సిపల్ మాజీ కో-ఆప్షన్ సభ్యులు కొత్తకొండ అంజన్నగౌడ్ చిత్రపటానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదివారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అంజన్నగౌడ్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని ఆయన కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. ఆయన వెంట లక్ష్మణ్ గౌడ్, వేణుమాధవరావు, రవీందర్ గౌడ్, సతీష్ రావు, మంద మల్లేశం గౌడ్, లక్ష్మణ్ రెడ్డి, భరత్ రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, నర్సయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

జగిత్యాలరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్-రఘురాముల కోట గ్రామాల్లో ఆదివారం ఐఎంఏ జగిత్యాలశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా 250 మంది రోగులకు ఉచితవైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఐఎంఏ వైద్యులు డాక్టర్ వాసాల శ్రీధర్, ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, ఎం. గీతిక, సంజీవరెడ్డి, సృజన, ఆర్. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన పద్మశాలి సంఘం సభ్యులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల పద్మశాలి సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్సీ ఎల్.రమణను మర్యాదపూర్వకంగా కలిశారు. మల్యాల పద్మశాలి సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బోడ గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి తాటిపాముల రాజేందర్, బండారి అశోక్, అడువాల కృష్ణ, గాలిపెల్లి అంజయ్య, సంఘం సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సత్యం రావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

ఎండపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజారాంపల్లి, ఎండపల్లి గ్రామాలలో ఇటీవలే మృతి చెందిన కుటుంబాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. మృతుల చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట మండల అధ్యక్షులు సింహాచలం జగన్, ఏలేటి కృష్ణారెడ్డి, గాజుల మల్లేశం, మేరుగు జానీ, పరంధాములు, రాజయ్య, పడిదం వెంకటేష్, నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ


మాజీ ఎంపీటీసీ వెంకన్నను అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మల్యాల మాజీ ఎంపీటీసీ దూస వెంకన్న ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పార్టీ కండువా కప్పారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయంకు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, సింగిల్ విండో డైరెక్టర్ బట్టు విజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ చేరిన వెంకన్నను మల్యాలలో కాంగ్రెస్ నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నక్క అనిల్, నాగులపేట సంజీవ్ తదితరులు శాలువతో సన్మానించి అభినందించారు.

నరసింహుడి సన్నిధిలో ఎల్ఐసీ జోనల్ మేనేజర్

ధర్మపురి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ ఆదివారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయం పక్షాన ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ఆయన యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాల్లో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. సేవా రంగమైన ఎల్ఐసీ సంస్థలో విధులు నిర్వహించడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఎల్ఐసీ ద్వారా చాలా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఎల్ఐసీ చీఫ్ ఇంజనీరు ఆర్ఎల్ స్వామి, కరీంనగర్ ఎస్‌డీఎం ఎస్‌వి ప్రసాద్‌రావు, మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్‌కే శ్రీనివాస్, జగిత్యాల, ధర్మపురి, మంథని బ్రాంచ్ మేనేజర్లు బలరామకృష్ణ శుభాకర్‌రావు, ఇందారపు రాంకిషన్, ఏబీఎం శివరాం పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపించాలి'

కోరుట్ల,ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డి గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిలో పలు ప్రాంతాల్లో బస్‌షెల్టర్ల నిర్మాణం జరగక ప్రయాణికులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ప్రయాణికుల సమస్యలను ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. మెట్‌పల్లిలో రాకపోకల సందర్భంగా ప్రయాణీకులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీకి ఆదాయాన్ని అందిస్తున్న ప్రయాణీకులకు సౌకర్యాలను సమకూర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో సంవత్సరాల తరబడి ప్రయాణీకుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో బస్‌షెల్టర్ల నిర్మాణం జరగకపోవడంతో ప్రతీ నిత్యం ప్రయాణీకులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.


మెట్‌పల్లిలో బస్సు కోసం రోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు

గతంలో బస్‌షెల్టర్ల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రతిపాదనలు కేవలం కాగితాలకే పరిమితం కావడంతో కార్యరూపం దాల్చలేదు. ప్రయాణీకులు చెట్ల నీడన, కిల్లీ, టీ కొట్టుల వద్ద నిలుచోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మహిళలు నానా అవస్థల పాలవుతున్నారు. పట్టణంలోని పాత బస్టాండు, బస్‌డిపో, వెంపెట్ రోడ్ తదితర ప్రాంతాల వద్ద బస్‌షెల్టర్ల నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. ఆత్మకూర్, ఆత్మనగర్ వైపు వెళ్లే వెల్లుల్ల క్రాస్ రోడ్డు వద్ద సైతం బస్టాండ్ నిర్మించేందుకు గత కొన్ని నెలల క్రితం కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు జ్ఞాపకర్థం ఓ దాత సహకారంతో బస్టాండ్ నిర్మించేందుకు ఏర్పాటు చేయగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఖాదీ స్థలంలో బస్టాండ్ ఎలా నిర్మిస్తారని అడ్డు చెప్పారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇదిలా ఉండగా ఖాదీ బోర్డు స్థలంలో బస్టాండ్ నిర్మించవద్దని ఖాదీ బోర్డు వారు కోర్టు నుండి స్టే తీసుకురావడంతో నిర్మాణం ఆడిపోయింది. దశాబ్ద కాలంగా సరైన సౌకర్యాలు లేక ప్రయాణీకులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రమాదాలకు నెలవు...

పట్టణ కేంద్రం గుండా జాతీయ రహదారి వెళ్తుండడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. రద్దీగా ఉన్న ప్రాంతంలో పలుమార్లు ప్రమాదం జరిగిన సంఘటనాలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి చేసే అధికారులు అనంతరం పట్టించుకోవడం లేదాని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికుల అవస్థలు
-బొడ్ల రమేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు



పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రతినిత్యం ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. స్థానిక పాల బస్టాండ్, బస్‌డిపో, వెల్లుల్ల రోడ్డు వైపులలో బస్‌షెల్టర్లు అవసరమున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రయాణికుల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలి. బస్ షెల్టర్ నిర్మాణం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల రాజకీయం మానేసి వెంటనే బస్ షెల్టర్ నిర్మించాలి.

ఎమ్మెల్యేను కలిసిన దళిత నాయకులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం పొరండ్ల గ్రామానికి చెందిన దళిత నాయ కులు ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా పొరండ్ల గ్రామానికి ఎస్సీ సబ్ ప్లాన్ లో నిధులు మంజూరు చేసినందుకుగాను ఎమ్మెల్యేకు ధన్యావాదాలు తెలిపారు.

పరామర్శ

అనారోగ్యంతో జగిత్యాల పట్టణంలోని ఓ ప్రైయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన రసమల్ల పుష్ప అనే మహిళను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని కరీంనగర్ సన్‌షైన్ ఆసుపత్రి మరియు క్రెమిస్ట్ డ్రగిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆద్రి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య క్యాంప్‌ల నిర్వహణ వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు రోగ నిర్ధారణ పరీక్షలు చేయడం శుభపరిమాణం అన్నారు. ప్రజలు ప్రతి రోజు వ్యాయమం చేయడం ద్వారా అరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే వైద్యులను, సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, ఐఎంఏ మాజీ అధ్యక్షులు తాటిపాముల సురేష్, నర్సయ్య, శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నఎమ్మెల్యే సంజయ్

ఆలయానికి దాతల వితరణ

వెల్గటూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ లోని శ్రీ అమరేశ్వర ఆలయానికి దాతలు సహకారం అందించారు. వెల్గటూర్‌కు చెందిన స్వర్గీయ డోలి శంకరమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త డోలి దేవరావు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వంట పాత్రలను అందజేశారు. కోటిలింగాలకు చెందిన మంచికట్ల శ్రీనివాస్, సత్తవ్వ దంపతులు ఆలయ గర్భాలయంలో రూ.30 వేలతో టైల్స్‌చే ఆధునీకరణ పనులు చేయించారు. కాగా ఆదివారం దేవరావు, శ్రీనివాస్‌లను ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండారి గంగాధర్, ఆలయ పూజారి గంట్యాల విద్యాసాగర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

రాయికల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాలు సాధించడంతో రాయికల్ పట్టణం భూపతిపూర్ గ్రామ అధ్యక్షుడు బొడ్డుపెల్లి జగన్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. దేశ రాజధాని ప్రజలు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంపై విశ్వాసాన్ని వ్యక్తం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్నేని రఘునందన్ రెడ్డి, ఏలేటి రమేష్ రెడ్డి, యుగేందర్ రెడ్డి, పురుషోత్తం, కొమురయ్య, మహేష్, వెంకట్ రెడ్డి, దేవదాసు, శేఖర్, రంజిత్, రాము, సుధాకర్, శేఖర్, మహేష్, నర్సా రెడ్డి, గంగారెడ్డి, రమేష్, విజయ్ పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

కోరుట్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, సంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యశాలకు హాజరై మాట్లాడారు. బరిలో ఉంటున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి సహా కోరుట్ల ఎన్నికల కన్వీనర్ సుదవేని మహేశ్, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ హాజరయ్యారు. నియోజకవర్గాల్లో మెజారి టీతో గెలిపించుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో భోగ శ్రావణి, వడ్డేపల్లి శ్రీనివాస్, దొనికెల నవీన్, సాగి మహేశ్ ఉన్నారు.